RNI NO: APTEL/26/A5325

www.mahinewsindia.com

మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 01 | సంచిక : 91 | ఎడిటర్ : నీలి రాముసుబ్బయ్య | పేజీలు : 4 | వెల రూ. 2 | శుక్రవారం - 18 - సెప్టెంబర్ - 2026

Published From : Chittoor circulated by YSR Kadapa I Kurnool I Guntur I East & West Godavari I Anatapuram I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు.. కొత్త రూల్స్‌తో షాక్!

చైనాలో కొత్త నిష్క్రమణ ఆంక్షలు అమల్లోకి

పౌరులు, విదేశీయుల ప్రయాణంపై అధికారులకు విస్తృత అధికారాలు

జాతీయ భద్రత పేరుతో ఆంక్షలు విధించే అవకాశం

నిబంధనలపై హెచ్ఆర్‌డబ్ల్యూ తీవ్ర ఆందోళన

విదేశీయులపైనా గతంలో ఆంక్షలు విధించిన ఉదాహరణలు

మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్.. ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ

యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం

'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం

ఎస్ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన

యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు జగన్ పై అనిత ఫైర్

- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని.. మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

- గుండెపోటుతో మరణించిన ఆళ్ల నానికి మంత్రి లోకేశ్ నివాళి
- రాజకీయాల్లో నాని హుందాగా వ్యవహరించారని కొనియాడిన లోకేశ్
- వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమస్యలపైనే పోరాడారన్న మంత్రి
- నాని కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ
- లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అంజలి

వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి.. 'VKS' మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

వారణాసిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో చంద్రబాబు

- మోదీ పాలనను వివరిస్తూ 'VKS' మంత్రాన్ని ఆవిష్కరించిన సీఎం
- కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక అభినందనలు
- ఎన్డీఏ బంధం చెక్కుచెదరదని, ఏపీకి అండగా నిలిచారని స్పష్టీకరణ

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన 'కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో మిగతా 2 లో

కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం

మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం

పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన

మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన

- కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని మిగతా 2 లో

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..

ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ

సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం

డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి మిగతా 2 లో

తెలంగాణను ప్రపంచం గర్వించే

రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

- ★ సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు
- ★ ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి
- ★ రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి

హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మిగతా 2 లో

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక

2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..

కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

- 2004 అఫిడవిట్‌లో కేసీఆర్‌కు భూమి లేదన్న పొంగులేటి
- ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారన్న బీఆర్ఎస్ వాదనపై కౌంటర్
- ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల పెరుగుదల కనిపిస్తోందన్న మంత్రి
- బీఆర్ఎస్ పాలనలో ఆస్తులు ఎలా పెరిగాయని నిలదీత

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం
కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడటం ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ శ్రేణులన్నీ కార్యాచరణ చేపడుతున్నాయని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

ఢిల్లీ: చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకునే విధంగా ఈ నిబంధనలు కల్పిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్‌ఆర్‌డబ్ల్యూ) తెలిపింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా గుర్తించిన దేశాన్ని విడిచి వెళ్లే హక్కుకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. సెప్టెంబరు 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాతీయ భద్రత, ప్రమాదాల పేరుతో, నష్టాల భయం సాకుతో ప్రయాణాన్ని అడ్డుకునే అవకాశం అధికారులకు కల్పించారని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆరోపించింది. దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షల విధింపులకు అవి అవసరమైనవి, సమతుల్యమైనవిగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు చెబుతున్నాయని సంస్థ పేర్కొంది. హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ మాయా వాంగ్ ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని దేశం నుంచి బయటకు వెళ్లనివ్వాలి? ఎవరిని అడ్డుకోవాలి? అన్నది అధికారులు తమ ఇష్టానుసారం నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, కొన్ని మైనారిటీ వర్గాల అంతర్జాతీయ ప్రయాణాలపై ఇప్పటికే చైనా అధికారులు నిఘా, ఆంక్షలు పెంచారని తెలిపారు. విదేశీయులపైనా ఇదే పరిస్థితి ఉంటోందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ హెచ్చరించింది. 2025 జులైలో ఓ అమెరికా ప్రభుత్వ ఉద్యోగి, వెల్స్ ఫార్గో బ్యాంక్ అధికారి చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారని పేర్కొంది. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని తెలిపింది. చైనా గత దశాబ్దంలో దేశం విడిచి వెళ్లే విషయంలో ఆంక్షలు క్రమంగా పెంచిందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, మానవ హక్కుల కార్యకర్తలపై ప్రయాణ పరిమితులు పెరిగాయని తెలిపింది. 2016లో జిన్‌జియాంగ్ అధికారులు గతంలో జారీ చేసిన పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత మైనారిటీ ఉయ్‌గర్ ముస్లింల విదేశీ ప్రయాణంపై ఆంక్షలు మరింత తీవ్రమయ్యాయని చెప్పింది. కొత్త నిబంధనలు భావ వ్యక్తీకరణ, విద్యా స్వేచ్ఛపై కూడా ప్రభావం చూపొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆందోళన వ్యక్తం చేసింది. దేశం విడిచి వెళ్లకుండా అడ్డుకుంటారనే భయంతో చైనా పౌరులు, విదేశీయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో వెనుకడుగు వేసే అవకాశం ఉందని పేర్కొంది.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
రంగంలోకి రెవెన్యూ అధికారులు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..
ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..
కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని కేసీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ స్వయంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను గతంలో ఎక్స్‌లో పంచుకున్న పొంగులేటి.. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన ఆస్తులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్లే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని పొంగులేటి ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లే ఈ ఆస్తులు వచ్చాయా అని నిలదీశారు. అయితే ఇవన్నీ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణను పొంగులేటి తన పోస్టులో వెల్లడించలేదు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకుందని పొంగులేటి ఆరోపించారు. కేసీఆర్‌కు పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ చెబుతున్నారని, మరి 2004 ఎన్నికల అఫిడవిట్‌లో ఆ వివరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడ విట్‌లో తప్పులు రాశారా? లేక ప్రజలకు తప్పుడు సమాచారం చెబుతున్నారా? అని కేటీఆర్‌ను పొంగులేటి నిలదీశారు.

మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..
ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు. ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' (ఫీమీమో) అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు. ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

మొదటి పేజి తరువాయి

తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. "అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం... వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం.

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం. ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం. భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం. భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం. 5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేశాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం. పాలమూరు--రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్ట్‌లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం. సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం. ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం. గౌరవ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా "తెలంగాణ సోషల్ జస్టిస్ డే" గా జరుపుకుంటున్నాం. సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం. ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.

ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ. 927 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించాం. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది. సనత్‌నగర్‌లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసుకున్నాం. ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈరోజు క్యాంపస్? ప్లేస్?మెంట్స్ సాధిస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నాం. మన యువత ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా వేగంగా విస్తరిస్తున్నాం. రూ. 38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. అవసరమైన భూసేకరణ చేపట్టాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అందుకే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నాం. యువత పెడదోవ పట్టకుండా రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్టం చేశాం. ఈ రోజు అవసరాలు తీర్చడమే కాదు. మా లక్ష్యం రేపటి తెలంగాణను నిర్మించడం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. రహదారులు అభివృద్ధికి సూచిక. గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టాం. ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ. 6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి.. 'VKS' మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక "వెరీ వెల్... వెరీ వెల్" అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టినీ ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం.

'VKS' మంత్రం.. సరికొత్త నినాదం

ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు 'ఎఖూ' అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. "ఎ అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, ఖ అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, ూ అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ 'ఎఖూ' మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు" అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

అభివృద్ధి, సంక్షేమంలో మోదీ మార్క్

మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు" అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

ఆత్మనిర్భర భారత్ నుంచి సాంకేతికత వరకు

రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ" అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.

కాశీలో బాలాజీ ఆలయానికి స్థలం ఇవ్వండి

తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి "నేను చెప్పింది నిజమే కదా?" అని ప్రశ్నిస్తూ, అందరితో "జై శ్రీరామ్" అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగింది.

ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను" అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.

ఏపీకి అండగా ఎన్డీఏ

ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. "అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం" అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విష్రప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

అమరావతి: ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని..
మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

అమరావతి: మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్ళం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. "ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం" అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరఫున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళులర్పించారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
వై ఎస్ ఆర్ కడప జిల్లా
శుక్రవారం - 18 - సెప్టెంబర్ - 2026

యువతకు భరోసా.. సమర్థత.. నాయకత్వం..

ప్రకాశవంతమైన భవిష్యత్తు

జమ్మలమడుగు ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కార్యక్రమం

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ సెప్టెంబర్ 17: జమ్మలమడుగు ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'యువతకు భరోసా -- సమర్థత, నాయకత్వం, ప్రకాశవంతమైన భవిష్యత్తు' కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డితో కలిసి కళాశాలకు చేరుకున్న ఆయన విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు, సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తుపై అవగాహన కల్పించే అంశాలపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జంబాపురం రమణారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరు సంతోష్, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా సంకల్ప అభియాన్‌లో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

మైలవరం బాలికల గురుకుల పాఠశాలలో సేవా కార్యక్రమాలు

కడప జిల్లా /మైలవరం, మహి న్యూస్ సెప్టెంబర్17: మైలవరం మండలం మైలవరం గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజా సేవ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, మండల అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాయచోటి సబ్ జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించిన

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

రాయచోటి, సెప్టెంబర్ 17 (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ గురువారం రాయచోటి సబ్ జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ క్లినిక్‌లోని రిజిస్టర్లను పరిశీలించి, అక్కడ అందుతున్న న్యాయ సేవలపై వివరాలను తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయం, వారి న్యాయపరమైన హక్కులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, న్యాయ సహాయం అవసరాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖైదీలకు అవసరమైన తగిన సూచనలు, సలహాలు అందించారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై ప్రచారం నిర్వహించి, న్యాయపరమైన సమస్యలు ఎదురైతే రాయచోటి మండల న్యాయ సేవా సమితి లేదా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, రాయచోటి సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి మోదీ జన్మదినం సందర్భంగా

రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

గాలివీడు:సెప్టెంబరు 17(మహి న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని గాలివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ నాయకులు గురువారం రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేయడం, అవసరమైన వారికి సహాయం అందించడం ద్వారా జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ చేతివృత్తులను పరిరక్షిస్తూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

విశ్వకర్మ వృత్తిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్, సెప్టెంబర్ 17: సంప్రదాయ చేతివృత్తులు, శిల్పకళలను పరిరక్షించడంతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని విశ్వకర్మ వృత్తిదారులు మరింత అభివృద్ధి సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు ఆకాంక్షించారు. విరాట్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని గురువారం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వకర్మ వృత్తిదారులు, శిల్పకారులు, చేతివృత్తిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. విరాట్ విశ్వకర్మను సృష్టి, నిర్మాణ నైపుణ్యానికి ప్రతీకగా భావిస్తారని మల్లికార్జునుడు పేర్కొన్నారు. భారతీయ

సంస్కృతిలో శిల్పకళ, చేతివృత్తులు, నిర్మాణ రంగానికి విశిష్ట స్థానం ఉందన్నారు. తమ నైపుణ్యంతో సమాజ అభివృద్ధి, ఆర్థిక పురోగతికి విశ్వకర్మ వృత్తిదారులు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. సంప్రదాయ వృత్తుల పరిరక్షణతో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తుల నాణ్యత, మార్కెట్ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి నాగేంద్రబాబు, బీసీ కార్పొరేషన్ ఈడీ శివకుమారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్ బాషా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వి. శశిభూషణ్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ యాదవ్, బీసీ జాతీయ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, విశ్వబ్రాహ్మణ కుల సంఘం అధ్యక్షుడు నరసింహాచారి, మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి వేగం పెంచాలి..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 17: బద్వేలు మున్సిపాలిటీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గురువారం బద్వేలు ఆర్డీఓ కార్యాలయంలో.. బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రస్తుత పరిస్థితిపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షలో అధికారులు వివిధ అంశాలపై కలెక్టర్‌కు వివరాలు అందించారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం రోజుకు 12.60 ఎంఎల్‌డీల తాగునీటి అవసరం ఉండగా, 8.40 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి సరఫరాలో ఉన్న అంతరాన్ని అధిగమించేందుకు అమృత్ 2.0 కింద 15 ఎంఎల్‌డీల నీటి శుద్ధి కేంద్రం, అదనపు పైపులైన్లు, నాలుగు కొత్త నీటి నిల్వ నిర్మాణాలు చేపట్టనున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలో వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై కూడా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. బద్వేలు మున్సిపాలిటీలో రోజుకు 35.1 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తుండగా, ఇంటింటి చెత్త సేకరణ 92 శాతం మేర జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయడం, సేకరించిన చెత్తను సక్రమంగా ప్రాసెసింగ్ చేయడంపై మరింత శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. డ్రైనేజీల పూడికతీత పనులను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అదనంగా 25 మంది పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులను మరింత మెరుగుపరిచి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు, పట్టణ ప్రణాళిక, అభివృద్ధి పనులు, పన్నుల వసూళ్లు తదితర అంశాలను కూడా సమీక్షించారు. ప్రజలకు అందాల్సిన మున్సిపల్ సేవలను సకాలంలో అందించడంతో పాటు, అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ మురళీ, మున్సిపాలిటీకి చెందిన వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి నీటి వనరుల అనుసంధానంపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి

బద్వేలు, మహి న్యూస్ సెప్టెంబర్ 17: బద్వేలు నియోజకవర్గంలో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం బద్వేలు ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా.. వ్యవసాయ అవసరాలకు నీటి సరఫరాను నియంత్రిస్తూ.. ప్రణాళికలు రూపొందించుకోవలన్నారు. కాశినాయన మండలంలోని బొక్కిలేరు వాగు కాలువ ద్వారా నీటిని ఎల్.ఎస్.పి. నగిలేరు ప్రాజెక్టుకు అందించి, అక్కడి నుంచి బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాల్లోని చెరువులకు నీటిని సరఫరా చేసే అవకాశాలను పరిశీలించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ నీటి వనరుల అనుసంధానం ద్వారా కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, బద్వేలు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంటుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బొక్కిలేరు కాలువ, ఎల్.ఎస్.పి. నగిలేరు ప్రాజెక్టు, పోరుమామిళ్ల పెద్ద చెరువు, బద్వేలు పెద్ద చెరువులను అనుసంధానించే మార్గాలను అధికారులు పటాల ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అందుబాటులో ఉన్న నీటి వనరుల సామర్థ్యం, కాలువల పరిస్థితి, నీటిని తరలించే మార్గాలు, అవసరమైన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అలాగే నియోజకవర్గంలోని మండలాల వారీగా తాగునీటి వనరుల పరిస్థితిని సమీక్షించి, నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు. అవసరమైన చోట బోర్లను గుర్తించి పరిశీలన పూర్తి చేయడంతో పాటు, వాటికి పైప్‌లైన్లను అనుసంధానం చేసే పనులను కూడా ముందుగానే చేపట్టాలని సూచించారు. నీటి సమస్య తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు ప్రణాళికతో శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న బోర్లు, కాలువలు, పైప్‌లైన్లు, ఇతర నీటి వనరుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, మరమ్మతులు అవసరమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బద్వేలు నియోజకవర్గానికి దీర్ఘకాలికంగా తాగునీటి భద్రత కల్పించేలా అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, జోయల్ విజయ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ మురళీ తదితరులు పాల్గొన్నారు.

నూతన రిజిస్ట్రార్ ఆచార్య గంగిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

కడప మహి న్యూస్ । సెప్టెంబర్ 17: యోగి వేమన విశ్వవిద్యాలయానికి నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎన్.సి. గంగిరెడ్డికి వైవీయూ బోధన, బోధనేతర సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైవీయూ ఆచార్యులు, యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (యూటా), అసిస్టెంట్ ప్రొఫెసర్లు (సి), బోధనేతర సిబ్బంది, అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులతో పాటు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల బోటనీ అధ్యాపకులు డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి, పాలిటెక్నిక్ లెక్చరర్ డాక్టర్ రాంమోహన్ రెడ్డి, పరిశోధక విద్యార్థి సాయి తేజ తదితరులు నూతన రిజిస్ట్రార్‌ను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. నూతన రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి నేతృత్వంలో యోగి వేమన విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధన, పరిపాలనా రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని పలువురు ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగంగా విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనలకు ప్రోత్సాహం, మౌలిక వసతుల బలోపేతం, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలలకు సంబంధించిన పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, అకడమిక్ క్యాలెండర్ అమలు, అనుబంధ గుర్తింపు ప్రక్రియలు, విద్యార్థుల ధ్రువపత్రాల జారీ, పరిపాలనా సమన్వయం వంటి అంశాల్లో ఎదురవుతున్న సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. అనుబంధ కళాశాలల అధ్యాపకులు, యాజమాన్యాలు, విద్యార్థులతో సమన్వయం పెంచి, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా విశ్వవిద్యాలయం--అనుబంధ కళాశాలల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, అనుబంధ కళాశాలల సహకారంతో విశ్వవిద్యాలయాన్ని విద్యా, పరిశోధనా, పరిపాలనా రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన రిజిస్ట్రార్ నేతృత్వంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రగతిపథంలో పయనించి, రాయలసీమ ప్రాంత విద్యాభివృద్ధికి మరింతగా దోహదపడాలని ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఆయుష్ వైద్య శిబిరానికి విశేష స్పందన

రాయచోటి, మహిన్యూస్ సెప్టెంబరు 17 : ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కొత్తపేట శివరామాలయం వీధిలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు వైద్యులు నూర్ అలీషా, సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాసరాజు, ఆలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

అర్జీలను స్వీకరించి అధికారులతో మాట్లాడిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్, సెప్టెంబర్ 17: ప్రజలు, పార్టీ కార్యకర్తల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్, ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రజలు, కార్యకర్తల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ



సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు భూపేష్ సుబ్బరామిరెడ్డి దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, కూటమి నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలు

మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 17: దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని చేతివృత్తుల వారు తమ నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) వెంకటేష్ సూచించారు. గురువారం మదనపల్లి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్ఓ వెంకటేష్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ చారి, బీసీ సంక్షేమ అధికారి తేజస్విని తదితరులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ.... విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణం, శిల్పకళ, చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలకు విశ్వకర్మ ప్రతీకగా నిలిచారని చెప్పారు. తరతరాలుగా వస్తున్న కళా నైపుణ్యాన్ని కాపాడుకుంటూ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చేతివృత్తుల వారికి సూచించారు. విశ్వబ్రాహ్మణులు తమ కళా నైపుణ్యంతో సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా స్వర్ణకారులు ఆధునిక అవసరాలకు అనుగుణంగా వినూత్న ఆభరణాలను రూపొందిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. విశ్వకర్మ భగవానుని ఆశీస్సులతో విశ్వబ్రాహ్మణులు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. స్వర్ణకారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్, ప్రత్యేక కాలనీ ఏర్పాటు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పది మంది స్వర్ణకారులు ఒక గ్రూపుగా ఏర్పడి క్లస్టర్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా బ్యాంకు రుణాలు, యంత్రాలు అందించే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలో

విశ్వబ్రాహ్మణ సంఘానికి స్థలం, విజయవాడలో రెండు ఎకరాల స్థలం కేటాయించి శిక్షణ, ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. చేతివృత్తిదారులకు రుణాలు, యంత్రాలు అందించి ఉపాధి అవకాశాలు పెంచేలా జిల్లా వారీగా చర్యలు చేపడుతున్నట్లు రామకృష్ణ చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి తేజస్వి, కలెక్టరేట్ ఏవో, సెక్షన్ సూపరింటెండెంట్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసి రామకృష్ణ, భాస్కరాచారి, యుగంధర్, నాగార్జున చారి, సుభద్ర, రత్నమాచారి, రమేష్, విద్యార్థులు, వివిధ చేతివృత్తుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాండ్రపల్లెలో వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

ఐక్యతకు ప్రతీకగా నిలిచిన గణపయ్య వేడుకలు

రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 17: జాండ్రపల్లెలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధతో, గ్రామ ఐక్యత, క్రమశిక్షణ, అపూర్వమైన ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. గ్రామంలోని ప్రతి కుటుంబం, యువత, పెద్దలు, చిన్నారులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని అన్నదానం, లడ్డు వేలంపాట, నృత్యాలు, పటాకుల సందడితో వేడుకలను వైభవంగా నిర్వహించారు. చిన్నా--పెద్దా అనే తేడా లేకుండా ఒక్కటై నిలిచిన జాండ్రపల్లె ప్రజల ఐక్యత ఈ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, గ్రామ చరిత్రలో ఒక గుర్తుండిపోయే ఘట్టంగా నిలిచింది.

44,050కు గణపయ్య లడ్డు వేలం

వినాయక స్వామివారి లడ్డు వేలంపాటలో ?44,050కు మచ్చా పెద్ద అంకన్న కుటుంబం లడ్డూను దక్కించుకుంది. వినాయక స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకోవడం తమ కుటుంబానికి ఎంతో ఆనందంగా, అదృష్టంగా భావిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి విశేషంగా కృషి చేసిన దేవరశెట్టి స్వరూప్ తేజ, జూలపల్లె బాబ్జాన్, ఎలుగోటి మధులను గ్రామస్థులు అభినందించారు. కమిటీ సమన్వయం, గ్రామస్థుల సంపూర్ణ సహకారం, భక్తుల ఐక్యతతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. "మా ఊరు -- మా ఐక్యత -- మా గణపయ్య" అనే స్ఫూర్తితో సాగిన ఈ వేడుకలు జాండ్రపల్లె ప్రజల ఐకమత్యానికి అద్దం పట్టాయి.

ఘనంగా జరిగిన రాష్ట్ర పండుగ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 17: సమాజ నిర్మాణంలో నైపుణ్యం కలిగిన వృత్తిదారులు, శిల్పులు, కార్మికుల పాత్ర అత్యంత కీలకమని, వారి శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతకు సమాజంలో ఎల్లప్పుడూ విశిష్టమైన గౌరవం ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వెడుకలలో తిరుపతి మున్సిపల్ కమీషనర్ ఎం.జయకృష్ణ, డి.ఆర్.ఓ. నరసింహులు లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి , విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీ విరాట్ విశ్వకర్మ మహర్షిని సృష్టికర్తగా, శిల్పకళా నిపుణుడిగా, వాస్తుశాస్త్ర పితామహుడిగా గౌరవిస్తారని తెలిపారు. సృజనాత్మకత, శిల్ప నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, కష్టపడి పనిచేసే తత్వానికి విశ్వకర్మ మహర్షి ప్రతీకగా నిలుస్తారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తి వృత్తి నిపుణులు, శిల్పులు, కార్మికులకు నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతను జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.పి రవి మనోహరాచారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి భరత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు , బీసీ సంక్షేమ శాఖ అధికారులు, బి.సి. హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

శ్రీకాళహస్తి, మహి న్యూస్, సెప్టెంబర్ 17: తణుకు నియోజకవర్గ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని, జ్ఞానప్రసూనాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు తదితర ఆలయ అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కు దేవస్థానంతరపునతీర్థప్రసాదాలు,శేషవస్త్రం అందజేశారు. పీఆర్వో శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానము శ్రీకాళహస్తి

రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

రేణిగుంట/ తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 17: తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన లో భాగంగా నేడు గురువారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గారికి రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు, సెట్విన్ సి ఈ ఓ యస్వంత్, ఎయిర్పోర్ట్ అధికారులు, రేణిగుంట తహసీల్దార్. శ్రావణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కి స్వాగతం పలికన వారిలో వున్నారు

రాత్రి వేళ ఓపెన్ లో ఉన్న నాయుడుపేట పిఎసిఎస్

నాయుడుపేట, సెప్టెంబర్ 17, మహి న్యూస్: నిబంధనల ప్రకారం సాయంత్రానికే ముగియాల్సిన ప్రభుత్వ కార్యాలయ వేళలను బేఖాతరు చేస్తూ, తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయం రాత్రి వేళ కూడా యథేచ్ఛగా తెరిచి ఉంచడం స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. గురువారం సాయంత్రం అధికారిక పనివేళలు ముగిసి మూడు గంటలు దాటినా, లోపల గుట్టుచప్పుడు కాకుండా కార్యకలాపాలు సాగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణ రోజుల్లో పగటిపూట రైతులు తమ సమస్యల కోసం, విత్తనాలు లేదా రుణాల కోసం కార్యాలయానికి వస్తే, సర్వర్లు పని చేయడం లేదని, ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని గంటల తరబడి తిప్పలు పెట్టే అధికారులు, ఈ అపరాత్రి వేళ ఎవరి కోసం తలుపులు తెరిచారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. నిశ్శబ్దంగా సాగుతున్న ఈ రాత్రి భాగోతం వెనుక పెద్ద ఎత్తున రికార్డుల మాయాజాలం జరుగుతోందా, లేక ప్రభుత్వ నిధులను దారిమళ్లించడానికి ఏమైనా స్కెచ్ వేశారా, అనే కోణంలో స్థానికులు, రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. పారదర్శకతను గాలికొదిలేసి, నిబంధనలను అతిక్రమించి సాగుతున్న ఈ వ్యవహారంపై తిరుపతి జిల్లా ఉన్నతాధికారులు మరియు సహకార శాఖ అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారులు నాయుడుపేట పీఏసీఎస్ కార్యాలయంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అసలు అక్కడ రాత్రి వేళ ఏం జరుగుతుందో గుట్టు రట్టు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించి నిబంధనలు ఉల్లంఘించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

"కాణిపాకం వినాయక స్వామికి పట్టువస్త్రాలు సమర్పణ "

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్ , సెప్టెంబర్ 17 : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నుండి ఈరోజు పట్టువస్త్రాలు సమర్పించడమైనది. ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ),కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనానాయక్, అర్చకులు, ట్రస్ట్ బోర్డు మెంబర్స్,వైదిక కమిటీ సభ్యులు ఈరోజు ఉదయం పట్టు వస్త్రాలు

సమర్పించారు. ఛైర్మన్,కార్యనిర్వాహణాధికారి, సిబ్బందికు కాణిపాకం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెంచల కిషోర్ స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు లింగంబొట్ల దుర్గా ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట రవి కుమార్, ముఖ్య అర్చకులు ఆర్. శ్రీనివాస శాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు వి. శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

22న జెడ్పీ సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబర్ 17: జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటలకు జెడ్పీ అధ్యక్షుల వారి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ శాఖల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా సమీక్షించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఈ నెల 18న విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ..

కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 17: జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 18న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హారేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోదివ్యాంగుల సమస్యల పరిష్కార కార్య క్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 18 వ తేదీ శుక్ర వారం కాకినాడ కలెక్టరేట్ ప్రజావాణి హాలులో సా. 4గం.ల నుంచి సా. 5గం.ల వరకు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ జరుగు తుందన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ద్వారా సంక్షేమ పథకాలు ఇతర శాఖాపరమైన విషయాలకు సంబంధించిన అంశాలపై తమ దరఖాస్తును వినతులను నేరుగా సమర్పించవచ్చుని జిల్లా కలెక్టర్ తెలిపారు. కావున కాకినాడ జిల్లాలో గల దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

సర్-2026పై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్



చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 17: ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (సర్ --2026) కార్యక్రమం అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ వివేక్ యాదవ్ గురువారం సచివాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్--2026లో భాగంగా కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా పునర్విమర్శ, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పరిశీలన, నోటీసులు, దరఖాస్తుల పరిష్కారం, విచారణలు తదితర అంశాలపై జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. చిత్తూరు జిల్లా కలెక్టరేట్ లోని నాగార్జున ఐఎఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్, ఆదర్శ రాజేంద్రన్ జిల్లా రెవెన్యూ అధికారి, మోహన్ కుమార్ తదితర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ సర్--2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిర్దేశిత కాలపరిమితికి అనుగుణంగా సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దరఖాస్తులు, విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తూ ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో చిత్తూరు జిల్లాలో సర్--2026కు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన ప్రక్రియ పురోగతిని జిల్లా జాయింట్ ఆదర్శ రాజేంద్రన్ వివరించారు. జిల్లాలో ఓటర్ల జాబితా పునర్విమర్శకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు, దరఖాస్తులు, విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నోటీసుల జారీ, దరఖాస్తుల పరిశీలన, ఆమోదం, తిరస్కరణ, ఫీల్డ్ వెరిఫికేషన్ తదితర ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఫారమ్--6, ఫారమ్--7, ఫారమ్--8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరస్కరణలకు సంబంధించి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట ఎస్ ఆర్ వోలో 'మామూళ్ల' మోత!

సూళ్ళూరుపేట, సెప్టెంబర్ 17, మహి న్యూస్: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సామాన్య ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని, సిబ్బంది మామూళ్ల పర్వాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే సామాన్యులకు నేరుగా అధికారులను కలిసే వెసులుబాటు లేకుండా చేసి, డాక్యుమెంట్ రైటర్లను కలెక్షన్ ఏజెంట్లుగా మార్చుకున్నారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లోనే రిజిస్ట్రేషన్లు.

లంచాలు నేరుగా తీసుకుంటే ఏసీబీ అధికారులకు దొరికిపోతామనే భయంతో, కార్యాలయ సిబ్బంది ఒక కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంలోకి అడుగుపెట్టకముందే, డాక్యుమెంట్ రైటర్ల ద్వారా భారీ మొత్తంలో ముడుపులు పిండుకుంటున్నారు. రోజంతా సేకరించిన డబ్బులను సాయంత్రం వేళల్లో అధికారులు, సిబ్బంది వాటాలుగా పంచుకుని ఇళ్లకు వెళ్తుండగా, పనుల కోసం వచ్చిన సామాన్యులు మాత్రం ఖాళీ జేబులతో, తీవ్ర నిరాశతో వెనుతిరుగుతున్నారు.

ప్రభుత్వ ఫీజు కంటే రెండు రెట్లు అదనపు బాదుడు.

గత వారం రోజుల క్రితం జరిగిన మూడు కీలక రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో ఈ అవినీతి భాగోతం బయటపడింది. ప్రభుత్వానికి అధికారికంగా చెల్లించాల్సిన ఫీజు కంటే, రెండు రెట్లు అదనంగా ప్రైవేట్ వ్యక్తుల ద్వారా వసూలు చేసినట్లు బాధితులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రధాన సిబ్బంది అండదండలతోనే సూత్రబద్ధంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

విచారణకు బాధితుల డిమాండ్.

నిజాయితీగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే సామాన్యులను పీల్చి పిప్పి చేస్తున్న సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అవినీతిపై జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ వెంటనే స్పందించాలని బాధితులు కోరుతున్నారు. తాము చెల్లించిన నగదు లావాదేవీలు బహిర్గతం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు భాధితులే చెబుతుండటంతో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చెరువు కట్టపై రూ. 40 లక్షల కలప మాయం

కొలిక్కి రాని దర్యాప్తు. అధికారుల మౌనం వెనుక మర్మమేమిటో..

ఓజిలి ఇరిగేషన్ ఏఈ, డిప్యూటీ ఎంపీడీవో, సూళ్లూరుపేట డి ఎల్ డి వో లపై అనుమానం.

ఓజిలి, సెప్టెంబర్ 17, మహి న్యూస్: ప్రజాధనానికి రక్షణగా ఉండాల్సిన అధికారులే దొంగలకు దారులు చూపిస్తున్నారా, ప్రభుత్వ ఆస్తిని దోచేస్తుంటే కళ్ళు అప్పగించి చూస్తూ ముడుపుల మత్తులో తూగుతున్నారా అని ఓజిలి మండల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఓజిలి మండలం నగుటూరు చెరువు కట్టపై జరిగిన రూ.40 లక్షల విలువైన చెట్ల నరికివేత, కలప మాయం వ్యవహారంలో సంబంధిత అధికారుల తీరు చూస్తుంటే ఇది నిజమేనని స్పష్టమవుతోంది. ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా, విచారణ పేరుతో కాలయాపన చేస్తూ అసలు దొంగలను కాపాడేందుకు అధికారులు పడుతున్న తాపత్రయంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.40 లక్షల పంచాయతీ ఆదాయానికి గండి.

నగుటూరు చెరువు కట్టపై ఏపుగ పెరిగిన వేలాది చెట్లను మూడు రాత్రుల్లో నరికి మాయం చేశారని స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు. అయితే నియమ నిబంధనల ప్రకారం చెరువు కట్టపై ఉన్న చెట్లను వేలం వేస్తే ఆ సొమ్ము పంచాయతీ ఖాతాలో చేరి గ్రామాభివృద్ధికి ఉపయోగపడేది. కానీ, ప్రభుత్వ నిబంధనలను కాగితాలకే పరిమితం చేసి, లక్షలాది రూపాయల ఆదాయాన్ని అక్రమార్కుల జేబుల్లోకి మళ్లించారు. వేలం ప్రక్రియ లేకుండా అంత పెద్ద ఎత్తున కట్టమీద ఉన్న కంప కర్రను, కలపను ఎవరు దొంగిలించారు, ఎక్కడికి తరలించారు అన్న ప్రాథమిక విషయాలను కూడా నేటికీ తేల్చకపోవడం వెనుక పెద్ద ఎత్తున పంచాయితీ సొమ్ము 'చేతులు మారినట్లు' తెలుస్తుంది.

ఇంటిదొంగలే కలవ దొంగలా..

ఈ భారీ దొంగతనంలో ఓజిలి మండల స్థాయి ఇరిగేషన్ అధికారితో పాటు పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఒకిలి డిప్యూటీ ఎంపీడీవో, సూళ్లూరుపేట డివిజనల్ అభివృద్ధి అధికారి పాత్రపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడు" అన్నట్లుగా శాఖాధిపతులుగా ఉన్న అధికారుల సహకారం, అండదండలు లేకుండా రూ. 40 లక్షల విలువైన కలపను తరలించడం సాధ్యమేనా అని కొందరు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇరిగేషన్ పనులు సైతం ఎందుకు ఆగిపోయాయో చెప్పలేని దుస్థితిలో అధికారులు ఉన్నారని ఘాటుగా విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ కనీస నిబద్ధత, బాధ్యత విస్మరించిన ఈ అధికారులపై ప్రజలు విరుచుకుపడుతున్నారు. "సమాధానం చెప్పాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇదే దొంగతనం మీ సొంత ఇంట్లో జరిగితే కూడా ఇలాగే చూస్తూ ఊరుకుంటారా, ప్రజా ఆస్తి అంటే అంత నిర్లక్ష్యమా అంటూ ఘాటుగా నిలదీస్తున్నారు.

ఉన్నతాధికారులు నిద్రలేచేది ఎప్పుడో..

తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, నగుటూరు చెరువు కలప దొంగతనం వెనుక ఎంతటి పెద్దల హస్తమున్నా ఉపేక్షించకూడదని ఓజిలి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, విచారణాధికారిని నియమించి సూళ్లూరుపేట డి ఎల్ డి వో, ఓజిలి ఇరిగేషన్ ఎ ఈ, డిప్యూటీ ఎంపీడీవో లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, పంచాయతీకి రావాల్సిన రూ. 40 లక్షలను రికవరీ చేయాలని పట్టుబడుతున్నారు. లేనిపక్షంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక ఆళ్ల నాని

ఏలూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 17 : ఆంధ్రప్రదేశ్ ఒక మంచి వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్థివదేహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. గురువారం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేష్.. ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. "ఆళ్ల నాని మృతి బాధాకరం. ఆంధ్ర రాష్ట్రం ఒక మంచి వ్యక్తిని కోల్పోయింది. నాని అన్న మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా ఉన్నాను. సభలో అనేక అంశాలపై ఆయనతో చర్చించేవాడిని. అయితే ఏనాడూ వ్యక్తిగత విమర్శలకు వెళ్లకుండా హుందాతనంగా ఆయన వ్యవహరించేవారు" అని లోకేష్ తెలిపారు. "రాజకీయాల్లో రాజనీతి ఉండాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆళ్ల నాని అన్న. వ్యక్తిగత దూషణలకు ఆయన ఎప్పుడూ దూరంగా ఉండేవారు, ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రజల సమస్యల గురించి మాట్లాడేందుకే ఉపయోగించాలనే భావనతో ఆయన ఉండేవారు" అని చెప్పారు. "ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా ఆళ్ల నాని సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయం. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి ప్రజలకు సేవ చేయాలని, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి నాని అన్న" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సమయంలో తాను ఆయనతో చెప్పిన విషయాలను మంత్రి గుర్తుచేశారు. "ఐదు సంవత్సరాలుగా మిమ్మల్ని దగ్గరుండి చూసిన వ్యక్తిని. మీరు ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటే వ్యక్తి కాదు. క్రమశిక్షణ అనే పాఠశాల మీది. మీలాంటి వ్యక్తులు రాజకీయాల్లో నడుచుకునే తీరును చూసి మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలని చెప్పాను" అని లోకేష్ తెలిపారు. అలాంటి మంచి వ్యక్తి ఈరోజు తమ మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆళ్ల నాని అంత్యక్రియలు జరుగుతున్నాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారధి అక్కడే ఉండి అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ తరపున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, మద్దిపాటి వెంకటరాజు, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఏపీ ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏపీ భవన నిర్మాణ, ఇతర నిర్మాణాల కార్పొరేషన్ ఛైర్మన్ వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com